ప్రజాశక్తి

సోమవారం 3 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల




ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

కందుకూరు నియోజకవర్గం..

త్వరలోనే 'ప్రకాశం'లో విలీనం

- జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఒంగోలు డెయిరీ పునరుద్ధరణకు చర్యలు
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- ఘనంగా ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవ వేడుకలు

5లో



వేడుకలలో ఓ విద్యార్థిని విన్యాసం

చీమకుర్తి గ్రానైట్‌పై

కార్పొరేట్ కన్ను

- భారీ పెట్టుబడులతో యూనిట్లు నెలకొల్పేందుకు యత్నాలు
- రాజస్థాన్, గుజరాత్ నుంచి వస్తున్న బడా వ్యాపారులు
- చిన్న యూనిట్లన్నీ మూత పడే ప్రమాదం



ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పాలిష్ యూనిట్లపై 'కార్పొరేట్' కన్నుబడింది. భారీ పెట్టుబడులతో యూనిట్లు నెలకొల్పి స్థానిక చిన్న తరహా గ్రానైట్ పరిశ్రమలను దెబ్బతీసే విధంగా ప్రయత్నాలు ఊపందుకున్నాయి. రాజస్థాన్, గుజరాత్ లాంటి రాష్ట్రాల నుంచి బడా పెట్టుబడిదారులు భారీ పెట్టుబడులతో యూనిట్‌లను నెలకొల్పటానికి ముందుకొస్తున్నారు. ఇప్పటికే కొందరు చీమకుర్తి, బుధవాడ, ఏలూరు రోడ్డు, గుడిపాడు, ఉప్పలపాడు ప్రాంతాలలో భూముల అన్వేషణలో నిమగ్నమై ఉన్నారు. ప్రభుత్వ అనుమతులు మరియు అధికారుల అనుమతులు పొందటానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈపాటికి కొందరు యూనిట్లు నెలకొల్పి ఉత్పత్తి కూడా ప్రారంభించారు.

చీమకుర్తి ప్రాంతాలలో పరిమితికి మించి యూనిట్లు నెలకొల్పటం వల్ల ముడిరాయి దొరకక, మార్కెట్ లేక చిన్న తరహా పరిశ్రమల యజమానులు అల్లాడుతున్నారు. నష్టాలతో సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో భారీ యూనిట్లు నెలకొల్పటం వల్ల చిన్న యూనిట్లన్నీ మూతపడే ప్రమాదం ఉంది. భారీ యూనిట్లకు ఒకరోజు విని యోగించే ముడి రాయితో 100 చిన్నతరహా యూనిట్లు నడపొచ్చు. అంటే భారీ యూనిట్లకు ఎంత ముడి రాయి అవసరమో అర్థమవుతుంది. సుమారు రూ.పది కోట్లతో చేపట్టే ఒక్కో యూనిట్‌లో నాలుగు మల్టీ బ్లేడు మిషన్లు బిగిస్తారు. ఒక్కొక్క బ్లేడుకు నెలకు 150 మీటర్ల ముడి రాయి అవసరం. నాలుగు బేళ్లకు 600 మీటర్ల ముడి రాయి అవసరం అవుతుంది. చీమకుర్తి ప్రాంతంలో దాదాపు పది క్వారీలలో మాత్రమే ముడి రాయి పూర్తిస్థాయిలో లభిస్తుంది. మిగిలిన క్వారీలలో వద్ద గొప్పముడి రాయి తప్ప పూర్తిస్థాయిలో దొరకదు. ఒక్కో క్వారీలో నెలకు 500 నుంచి 600 మీటర్లు ముడిరాయి ▶ 2లో

ఇది కార్పొరేట్ బడ్జెట్

- విభజన హామీలకనుగుణంగా బడ్జెట్లో కేటాయింపులు జరగాలి..
- సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాకు ఎటువంటి ప్రాధాన్యత కల్పించకుండా మొండి చెయ్యి చూపారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు విమర్శించారు. ఇది మధ్యతరగతి బడ్జెట్ కాదని, కార్పొరేట్ బడ్జెట్ అని పేర్కొన్నారు. ఆ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పాడు అద్దంకి బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు మేలు చేసేదిగా ఉందని విమర్శించారు. రూ 50,65,345 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీకి గతం మాదిరిగానే నామ మాత్రపు నిధులు కేటాయించటం నిరాశపరిచిందన్నారు. అత్యంత కీలకమైన విద్య, వైద్య రంగాలకు కూడా నామమాత్రంగా నిధులు కేటాయించడం విచారకరమన్నారు. దేశ వ్యాప్తంగా కోటి మంది ఈపీఎఫ్ పెన్షన్ దారులు ఉంటే, ఈ బడ్జెట్లో వారి గురించి ఊసే లేకపోవడం విచారకరమన్నారు. విభజన హామీలకు సంబంధించి పోలవరం,



ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

విశాఖ రైల్వే జోన్ స్టీల్ ప్లాంట్‌కు అరకొర నిధులు కేటాయించడం పట్ల కేంద్రానికి ఉన్న అభిమానం వ్యక్తమవుతోందన్నారు. సాంఘిక సంక్షేమానికి, జలజీవన్ మిషన్‌కు ఎటువంటి ప్రాధాన్యత లేకపోవడం గమనించాలన్నారు. టెలికం రంగాన్ని పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసే దిశగా బడ్జెట్ రూపొందించారని ఆరోపించారు. కొద్దిమంది ఉద్యోగులకు ఇన్ కంటాక్స్ రాయితీ ప్రకటించి, కోట్లాది మంది ప్రజలపై భారాలు మోపే విధంగా ▶ 2లో



బాపట్లలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తాత్కాలికంగా రద్దు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి సుదూర ప్రాంతాల నుండి అర్జీలు ఇవ్వడానికి ప్రజలు కలెక్టరేట్‌కి రావద్దని తెలియజేశారు.

తాత్కాలికంగా పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

బాపట్ల జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్జీలు ఇవ్వడానికి బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాదలచిన వారు ఈ విషయాన్ని గమనించాలని ఎస్పీ తెలిపారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

'ఫీజు పోరు'ను జయప్రదం చేయాలి

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన 'బూచేపల్లి'

5లో

రైల్వే స్టేషన్‌లో మొరాయించిన లిఫ్ట్

నరకయాతన పడిన ప్రయాణికులు • కాపాడిన ఆర్‌పిఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కటంతో రైల్వే స్టేషన్ ఆవరణంలోని లిఫ్ట్ మొరాయించింది. ఫలితంగా వారు మూడు గంటల పాటు నరకయాతన పడ్డారు. చివరకు రైల్వే పోలీసుల సహాయంతో ప్రాణాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకెళ్తే.. వివిధ ప్రాంతాలకు చెందిన కొంతమంది ప్రయాణికులు తిరుపతి దైవదర్శనానికి వెళ్లి అక్కడ దర్శనం ముగించుకుని శ్రీశైలం, వారి స్వస్థలాలకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం నాలుగు గంటలకు మార్కాపురం రైల్వే స్టేషన్‌లోని రెండో నెంబర్ ప్లాట్ ఫారంపై రైలు దిగారు. అక్కడి నుంచి మొదటి నెంబర్ ప్లాట్ ఫారానికి వెళ్లేందుకు రెండో నెంబర్ ప్లాట్‌ఫారం ఆవరణలో ఉన్న లిఫ్ట్‌లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కారు. దీనితో లిఫ్ట్ కొంత పైకి వెళ్లి ఒక్కసారిగా మధ్యలో ఆగిపోయింది. దీంతో తీవ్ర ఆందోళన చెందిన ప్రయాణికులు లిఫ్ట్ గేట్లు తెరిచేందుకు ప్రయత్నించారు. ఎంతకీ రాకపోవడంతో కాపాడండి అంటూ కేకలు వేస్తూ ఉండడాన్ని గమనించిన ప్రయాణికులు ఘటన గురించి మార్కాపురం రైల్వే పోలీసులకు తెలుపగా ఆర్‌పిఎఫ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో హుటాహుటిన లిఫ్ట్ వద్దకు చేరుకొని తాళ్ల సహాయంతో కొంతమేర లిఫ్ట్‌ను పైకి లాగి గేట్లను తెరిచేందుకు ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా గేట్లు తెరుచుకోకపోవడంతో వాటిని ధ్వంసం చేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడుదాం అనుకున్నా ఫలితం దక్కలేదు. లిఫ్ట్‌లో ఇరుక్కుని ఉన్న ప్రయాణికులకు మంచినీరు, చిన్నారుల పాలు, తిరుబండారాలను అందించి కొంత సమయం ఓపిక పట్టాలని చెబుతూ ఆర్‌పిఎఫ్ సిబ్బంది ఎంతో చాకచక్యంగా దాదాపు మూడు గంటలు శ్రమించి లిఫ్ట్ పై భాగం నుంచి ఒక్కొక్కరిగా ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎఫ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లిఫ్ట్ కెపాసిటీ ఎనిమిది మంది ఉండగా 14 మంది ప్రయాణికులు వారి లగేజ్‌తో ఎక్కారని, వారిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారని తెలిపారు. అధికలోడు కారణంగా సాంకేతిక సమస్య ఏర్పడడంతో లిఫ్ట్ మార్గమధ్యంలో ఆగిపోయిందన్నారు. తాము ఎంతసేపు కష్టపడ్డామనేది ముఖ్యం కాదని, ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా అందర్నీ కాపాడడంలో ఉన్న సంతృప్తి ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు, రైల్వే అధికారులు రాయవరం గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



లిఫ్ట్ నుంచి సురక్షితంగా బయటకు వచ్చిన ప్రయాణికులతో ఆర్‌పిఎఫ్ పోలీసులు

ఆర్‌పిఎఫ్ పోలీసులకు ప్రయాణికుల కృతజ్ఞతలు

ఘటన గురించి సమాచారం తెలుసుకున్న మార్కాపురం ఆర్‌పిఎఫ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ సిబ్బందితో తెల్లవారుజామున ఐదు గంటలకు లిఫ్ట్ వద్దకు చేరుకొని ప్రయాణికులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఎంతో చాకచక్యంగా సమయస్ఫూర్తితో వ్యవహరించి ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా మూడు గంటల పాటు శ్రమించి ఒక్కొక్కరిగా ప్రయాణికులను సురక్షితంగా లిఫ్ట్ పైనుంచి బయటకు తీయడం పట్ల స్థానికులు రైల్వే అధికారులను అభినందించారు. తీవ్రంగా శ్రమించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఆర్‌పిఎఫ్ సిబ్బందికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

డిఆర్‌యుసిసి సభ్యులు గాయం వెంకట నారాయణరెడ్డి

ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. లిఫ్టును పునరుద్ధరించాలి. రైల్వే ప్రయాణికులకు అన్ని విషయాలలో మెరుగైన సేవలు అందించాలి.

టిడిపిలో చేరిన సీనియర్ నాయకులు అయ్యన్న



శ్రీనివాసరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామ నాయకులు నల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న వైసీపీని వీడి టిడిపిలో చేరారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డులో గల ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీలో చేరగా ఆయనకు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ టిడిపి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలక్షన్ సమయంలో టిడిపి కోసం పని చేశారని, ఆ సమయంలోనే పార్టీలో చేరవలసి ఉండగా కొన్ని కారణాలవల్ల వాయిదా పడిందని చెప్పారు. ఆయన పార్టీలో చేరటం సంతోషంగా ఉందని చెప్పారు. టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లూరు వెంకట్రావు, మలసాని వెంకట రమణారావు, నల్లూరి చింప్రియ, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, పోతినేని శ్రీనివాసరావు, నల్లూరి అశోక్, నల్లూరి శ్రీను, నర్రా శ్రీనాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది కార్పొరేట్ బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ రూపొందించారన్నారు. రాష్ట్రానికి ఎటువంటి ప్రాధాన్యత లేని బడ్జెట్ కేటాయింపులపై నేతలు 'గొప్ప బడ్జెట్'గా కీర్తించటం సిగ్గుచేటన్నారు. విభజన హామీల అమలుకు అనుగుణంగా నిధులు రాబట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ప్రకాశం జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించి కూడా ఆ మేరకు నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు బి.వి.రావు, కొర్నెపాటి శ్రీనివాసరావు, టి.మహేష్, ఎస్‌డి.హుస్సేన్, కె.శ్యాంసుందర్, పి.సుబ్బారావు, డి ఆనంద్, ఎండి బేగ్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో నిరసన

బాపట్ల: కేంద్రం ప్రకటించిన బడ్జెట్ కాకుల్ని కొట్టి గద్దలకు వేసే విధంగా ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య అన్నారు. కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు రైతులకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో పాత బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద సిపిఎం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొండయ్య మాట్లాడుతూ అదానీకి, అంబానీకీ పల్లకి మోసే విధంగా, రెడ్ కార్పెట్లుపరిచే విధంగా బడ్జెట్ ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజలు అవస్థలు పట్టించుకోని విధంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ఉక్కు పరిశ్రమకు, విశాఖ రైల్వే జోన్ కు బడ్జెట్ వల్ల తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, కళ్ల ముందే కనిపిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇది మంచి బడ్జెట్ అని మెచ్చుకోవడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రాష్ట్ర తిరోగమనాన్ని సూచిస్తోందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వసంతరావు, సిఐటియు శరత్, సుభాషిణి, కే.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చీమకుర్తి గ్రానైట్‌పై 'కార్పొరేట్' కన్ను

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే లభ్య మవుతుంది. కార్పొరేట్ సంస్థలు పాలిషింగ్ యూనిట్ల రంగంలోకి అడుగుపెడితే ఒక క్వారీలో లభించే ముడిరాయి పూర్తిగా ఒక మల్టీ బ్లేడు యూనిట్‌కు సరిపోతుంది. ఉదా హరణకు పది ఫ్యాక్టరీలు కార్పొరేటు స్థాయి వాళ్లు నెలకొల్పితే పది క్వారీలలో లభించే మెటీరియల్ పూర్తిగా వారికే సరిపోతుంది. స్థానికంగా ఉండే మిగిలిన వెయ్యి చిన్నతరహా యూనిట్ల వారికి ముడి రాయి లభ్యత ప్రశ్నార్థకం అవుతుంది. స్థానికంగా ఉపాధి పొందుతున్న యువత మరియు మధ్య తరహా యజమానులు కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

రాజస్థాన్, గుజరాత్, బెంగుళూరు నుంచి చాలామంది కార్పొరేట్ సంస్థల వ్యాపారులు ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు జిల్లా, శ్రీకాకుళం జిల్లా, విశాఖ జిల్లాల్లో పాగా వేసి పూర్తిస్థాయి గుత్తాధిపత్యాన్ని సాధించారు. తమిళనాడు లోని మధురైలో కూడా స్థానికంగా ఉండే యూనిట్లను హస్తగతం చేసుకున్నారు. మార్కెట్ పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లింది. వాళ్లు నిర్ణయించిందే రేటు. డొమెస్టిక్ మార్కెట్, ఎక్స్‌పోర్ట్ మార్కెట్ పూర్తిగా వాళ్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. వాళ్లే పరిశ్రమలు నెలకొల్పి ముడి రాయి కొనుగోలు చేసి, పాలిషింగ్ చేసి, దేశంలో ఉన్న ప్రముఖ నగరాలలో, పట్టణాలలో షోరూంలో నెలకొల్పి అమ్మకాలు సాగిస్తున్నారు. విదేశాలకు వారే ఎగుమతులు నిర్వహించుకుంటున్నారు. చీమకుర్తి ప్రాంతంపై కూడా ఇప్పుడు కార్పొరేట్ల కన్నుబడింది. ఈ పాటికే ఓ పది మంది బడా వ్యాపారులు ముందుగా స్థానికంగా ఉండే పాలిషింగ్ యూనిట్లను లీజులకు తీసుకొని నడుపుతున్నారు. భారీ స్థాయిలో యూనిట్లను కూడా నెలకొల్పటానికి భూముల సేకరణ మరియు అనుమతుల సేకరణ లాంటి ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారు. వీరే గనక పూర్తిస్థాయిలో విస్తరిస్తే స్థానికంగా ఉండే యూనిట్లన్నీ మూతపడే ప్రమాదముంది. పరిశ్రమ మొత్తం కార్పొరేట్ల కనుసన్నల్లోకి వెళ్లే అవకాశం ఉంది. మధురై, శ్రీకాకుళం, చిత్తూరు, వైజాగ్ పరిశ్రమ మొత్తం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లినట్లే.. గెలాక్సీ గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు కూడా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం పొంచి ఉంది. స్థానికంగా ఉండే యజమానులకు ఈ పరిణామం ఆశానిపాతంగా మారింది. ఈ నేపథ్యంలో స్థానిక పాలిషింగ్ యూనిట్ల యజమానులు సంఘటితమవుతున్నారు. కార్పొరేట్ సంస్థలకు, బడా సంస్థలకు పాలిషింగ్ యూనిట్లు నెలకొల్పటానికి అనుమతులు ఇవ్వద్దని కోరుతున్నారు.

నేడు సంఘాల సమావేశం

సోమవారం నాడు రామతీర్థంలోని వీటిసి లో చీమకుర్తి ప్రాంతాలలోని పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంయుక్త సమావేశం జరగనుంది. సమావేశంలో చీమకుర్తి, ఆర్‌ఎల్‌పురం, బుధవాడ, ఏలూరు రోడ్డు ఏరియాలలోని పాలిషింగ్ యూనిట్ల యజమానులు అందరూ హాజరయ్యే విధంగా నాయకులు ప్రయత్నిస్తున్నారు. చిన్నతరహా పరిశ్రమల మనుగడ కోసం భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించుకొని, కొత్త యూనిట్లకు అనుమతి ఇవ్వకుండా ఎలా ముందుకెళ్లాలో నిర్ణయించుకోనున్నారు.

35 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో స్థానిక స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి 35 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కంకణాల కృష్ణమోహన్, ఆసుపత్రి సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ బిపి, షుగరు వ్యాధులు మామూలు వ్యాధుల వలే జబ్బులు కాదని, శరీరంలో కొన్ని గ్రంథులు సరిగా పనిచేయక పోవడం, ఇతర కారణాల వలన ఏర్పడే మెటబాలిక్ లోపాలని అన్నారు. 40 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ అప్పుడప్పుడు షుగరు, బిపి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొక్కిసం సుబ్బారావు, వీరమోసు మస్తాన్ రావు, మానికొండ వెంకటేశ్వర్లు, రావెళ్ల చెంచయ్య, రావెళ్ల వరవర్ధనరావు, ఆరోగ్య భవనం దాత గుంటుపల్లి కోటయ్య, గ్రామప్రజలు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 3
సోమవారం 3 ఫిబ్రవరి 2025

టీడీపీ స్థలంలో కబ్జాదారుల పాగా

రిజిస్ట్రేషన్ ద్వారా చేతులు మారిందనే ప్రచారం

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణ నడిబొడ్డున పటేల్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం నా పార్టీ సానుభూతిపరులైన ముప్పా కుటంబ సభ్యులు లక్షలు విలువ చేసే భూమిని ఉచితంగా దానం చేశారు. దాతలు స్థలం దానం చేసి దశాబ్దాలు దాటిపో తున్నప్పటికీ ఆ స్థలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎటువంటి నిర్మాణం గానీ కట్టడాలు గాని జరపకపోవడంతో ఖాళీ ఉంది. ఈ నేపథ్యంలో ఆ స్థలానికి తానే యజమానినంటూ తప్పుడు పత్రాలు సృష్టించి ఆ వ్యక్తి మరొక వ్యక్తిని అడ్డం పెట్టుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ స్థలాన్ని పట్టించుకోకపోవడంతో బాపట్ల మండలం పాండురంగాపురంకు చెందిన ఓ వ్యక్తి స్థలాన్ని 2024 డిసెంబర్‌లో పార్టీకి చెందిన స్థలాన్ని మరొకరికి అమ్మేశారు. ఇదంతా తెలుసుకున్న బాపట్ల టిడిపి నాయకులు బాపట్ల పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై పోలీసులు సదరు వ్యక్తిని పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా బాపట్ల, జిల్లా కేంద్రమైన తర్వాత ఖాళీ స్థలాలు కనిపిస్తే ఎవరికి వారు యజమాని నేనే అనుకోని సబ్ రిజిస్ట్రార్‌ను ప్రసన్నం చేసుకుని రిజిస్ట్రేషన్లు చేయించుకుంటూ అక్రమంగా స్థలాలను సొంతం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీకి చెందిన భూమి ఎవరెవరో రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. పార్టీ నాయకులపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాతలు పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం ఇచ్చిన స్థలాన్ని కాపాడుకోలేని స్థితిలో పార్టీ నాయకత్వం నిద్రావస్థలో ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రమైన బాపట్లలోనే అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన స్థలం అన్యాక్రాంతం కావడం అవమానంగా ఉందని పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. పార్టీ స్థలం వాస్తవంగా అన్యాక్రాంతానికి గురైతే పార్టీ స్థలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకత్వంపై ఉంది.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-చీరాల

రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల మరియు హైదరాబాద్ ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రోటరీ సామాజిక భవనంలో రక్త నాళాల, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోమాచారి పర్యవేక్షణలో 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జరీ అవసరం అయిన 30 మందికి హైదారాబాద్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్ కుమార్, డి.వి.సురేష్, కె.శ్రీనివాస బాబు, జాలాది కృష్ణ, ప్రతాప్, జాగర్లమూడి సురేష్, జి.వై.ప్రసాద్, శ్రీనివాసరావు, డా.బాబూరావు, డాక్టర్ పున్నారావు, నిత్యానంద లాల్, రోటరీ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కలు దాడి

12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం తాళ్లపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో కొన్ని గొర్రెలు మృతి చెందగా మరికొన్ని తీవ్రంగా గాయాలపాలయ్యాయి. గ్రామానికి చెందిన ఎం.చిన్న తిరుమలయ్య రోజు మాదిరిగా తన ఇంటి ఆవరణ దొడ్డిలో గొర్రెల మందను ఉంచాడు. ఉదయం లేచి చూడగా కుక్కల దాడికి గొర్రెలు గాయాలతో తీవ్ర అస్వస్థతకు గురై ఉన్నాయి. 12 గొర్రెలు మృతిచెంది పడిఉన్నాయి. దీంతో తిరుమలయ్య కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న సంజీవరావుపేట పశువైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె శ్రావణ్‌కుమార్ హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి కుక్కల దాడికి గురైన ఐదు గొర్రెలకు వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు.

ఘనంగా 'శ్రీకష్ణ లీలారించోళి' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



పుస్తకం ఆవిష్కరిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

స్థానిక ఒంగోలులోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం ప్రముఖ పద్యకవి, గిడుగు పురస్కార గ్రహీత డీవీఎం సత్యనారాయణ రచించిన 'శ్రీకష్ణ లీలారించోళి' గ్రంథాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే, పూర్వ ఉపసభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు. కళామిత్రమండలి (తెలుగు లోగిలి), వివిఐటి సంస్థల సంయుక్తంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా బుద్ధప్రసాద్ మాట్లాడారు. సభకు కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా గుంటూరు వివా-వివిఐటి తరపున ప్రతినిధిగా మోదుగుల రవికృష్ణ విచ్చేశారు. గౌరవ అతిథిగా కళారత్న, సరస్వతీపుత్ర డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు పుస్తకాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సాహితీ పోషకులు వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), భాషావిభూషణ నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, ఖజానాశాఖ ఉప సంచాలకులు అన్నాపంతుల జగన్నాథరావు, కళామిత్రమండలి ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, గాడేపల్లి దివాకర్ దత్తు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, ఘోర కవి సంపత్, యు.వి రత్నం పాల్గొన్నారు.

పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలి

మన బాల భారతి హైస్కూల్‌లో వీడ్కోలు సభ



విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సంతమాగులూరు

రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఇ అభియాస్ అకాడమీ ఒలింపిక్ యాడ్స్ ఫౌండేషన్ అధినేత భువనగిరి పణి పవన్ తెలిపారు. ఆదివారం మండలంలోని పుట్టావారి పాలెం సమీపంలో ఉన్న మన బాల భారతి హైస్కూల్‌లో డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, పాఠశాలకు గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సంస్కారవంతమైన చదువు చెప్పడంతో పాటు మంచి సమాజాన్ని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ నాయకులు ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు, అర్వపల్లి రత్తయ్య, ప్రసాద్, ఎల్లిపాయల శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేశారని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జి. వీరభద్రాచారి అభిప్రాయపడ్డారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, ఐ.టి రంగాలతో పాటు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి 1.81 లక్షల కోట్లు కేటాయించి పెద్దపీట వేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా పోలవరం, విశాఖ ఉక్కు కర్మాగారానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయింపు హర్షణీయమన్నారు. మోదీ నేతృత్వంలో దేశం మరింతగా ప్రగతిపథంలో నడుస్తుందని వీరభద్రాచారి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, ప్రభుదాస్, వెంకయ్య పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

గూడ్స్ రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్ప డిన ఘటన మండల పరిధిలోని రాయవరం గ్రామ సమీపంలోని మార్కాపురం రైల్వే స్టేషన్ ఆవరణంలోనీ స్టేషన్ మాస్టర్ గది ఎదుట ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరములు ప్రకారం.. మార్కాపురం రైల్వే స్టేషన్‌లోకి వేగంగా వస్తున్న గూడ్స్ రైలు బండికి కిందకు అక స్మాత్తుగా ఒక యువకుడు దూరి ఆత్మహత్యకు పాల్పడడం జరి గింది. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు ఘటన గురించి మార్కాపురం ప్రభుత్వ రైల్వే పోలీసులకు సమాచారం తెలుపగా హెడ్ కానిస్టేబుల్ ఈ. హరికష్ణ రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలా నికి చేరుకొని ఆత్మహత్యకు పాల్గొన్న యువకుడి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి తెలిపారు. మృతుడి గురించి ఏమైనా సమాచారం తెలిసిన యెడల మార్కాపురం రైల్వే పోలీసులకు తెలపాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్లెక్సీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా దర్శనమిస్తున్న ప్లాస్టిక్, ప్లెక్సీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఒంగోలు సిటిజన్ అసోషియేషన్ అధ్యక్షులు కొల్లా మధు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు విన్నవిస్తూ ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ల నుంచి పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్, ప్లెక్సీలు రాష్ట్రంలో ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. ఎక్కడ ఖాళీస్థలం, కాల్వల్లో చూసినా వాటి తాలుకు వ్యర్థాలే అధికంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. నగరాలలో ప్లెక్సీలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసినా అవి ఎక్కడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్, ప్లెక్సీల కారణంగా కాలుష్యం పెరిగి ప్రజల ప్రాణాలకు హాని జరుగుతున్నా పాలకులు పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. వీటి నియంత్రణకు రాష్ట్ర స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కోరారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రమాదవశాత్తూ మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శింగరాయకొండ పరిధిలోని శ్రీరామ్ నగర్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీరామనగర్‌కు చెందిన తన్నీరు కొండూరత్నం(55) రోడ్డుపై వెళ్తుండగా నిర్మాణంలో ఉన్న కల్వర్టు పక్కనే ఉన్న మరుగుకాలువలో పడిపోయాడు. గుర్తించిన స్థానికులు కాలువ నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. ఎస్ఐ బి.మహేంద్ర సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

ఊళ్లపాలెం-వేములపాడు రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో శ్రీరామ్‌నగర్ వద్ద ఆర్అండ్‌బీ అధికారులు కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో అటువైపుగా వెళుతున్న కొండూరత్నం కాలు జారి పక్కనే ఉన్న మురికి కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్న నేపథ్యంలో ముందువైపున ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకుండా వదిలేయటం ఆ ప్రాంతంలో పాఠశాల ఉన్నప్పటికీ చిన్న పిల్లలు అటు ఇటు తిరుగుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఇలా జరిగిందని చెబుతున్నారు.



క్షతగాత్రుడిని వైద్యశాలలో చేర్పిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వైద్యశాలలో చేర్పించిన ఎస్ఐ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎండ్లూరు డొంక సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రహదారిపై పడి వున్న గోళ్ల ఏడుకొండలు అనే యువకుడిని మానవతా దృక్పథంతో సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు తన పోలీస్ వాహనంలో ఎక్కించుకొని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఒంగోలు ఎన్జీవో కాలనీకి చెందిన ఏడుకొండలు తన మోటార్ సైకిల్‌పై వెళుతూ మండలంలోని ఎండ్లూరుడొంక ప్రాంతానికి చేరుకునే సరికి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి పోయాడు. అటుగా వెళుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు గమనించి వెంటనే జీపు ఆపి క్షతగాత్రుడిని జీబులో ఎక్కించుకొని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఎస్ఐ అజయ్‌బాబు సేవలను పలువురు ప్రశంసించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో సోమవారం సౌత్ బైపాస్ రోడ్డు, కొత్తడొంక, 220 కెవి సబ్ స్టేషన్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

కార్పొరేట్ల కోసమే కేంద్ర బడ్జెట్

సిపిఎం నాయకుల విమర్శ

ప్రజాశక్తి-మార్టూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని సిపిఎం నాయకులు భక్తులు హనుమంతరావు విమర్శించారు. ఆదివారం మార్టూరు సెంటర్లో సిపిఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాలకు బడ్జెట్లో నిధులు తగ్గించారని తెలిపారు. వ్యవసాయం గిట్టుబాటు గాక రైతుల ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. రైతుల పండించిన పంటలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.రాంబాబు, బి.సూరిబాబు, ఎస్.గఫూర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో చేనేత రంగానికి మొండిచేయి

చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ



సత్యనారాయణ

భట్టిప్రోలు: కేంద్ర బడ్జెట్లో చేనేత రంగానికి కేవలం 200 కోట్ల రూపాయలు కేటాయించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ అన్నారు. భట్టిప్రోలు ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తర్వాత చేనేత రంగం ప్రసిద్ధి చెందిందని, అలాంటి చేనేత రంగానికి కేవలం 200 కోట్ల రూపాయలు కేటాయించటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు ఐదువేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే చేనేత కార్మికులకు ఏర్పాటు చేసినట్లు చెబుతున్న ముద్ర లోన్లను చేనేత కార్మికులకు ఇప్పించాలని ఆయన కోరారు. అదేవిధంగా రానున్న రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతులను మోసం చేసిన బడ్జెట్

రైతు సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల కోటేశ్వరావు

ప్రజాశక్తి-ఇంకొల్లు



మాట్లాడుతున్న కందిమళ్ల కోటేశ్వరరావు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులను మోసం చేసే విధంగా ఉందని రైతు సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల కోటేశ్వరావు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్లో వ్యవసాయానికి కేటాయింపులు పెంచినట్లుగా చూపించి మత్స్య శాఖను వ్యవసాయ శాఖ పద్దులో వేయడం రైతులను వ్యవసాయ రంగాన్ని మోసం చేయడమేనని విమర్శించారు. ఈపాటికే కుదేలయిన వ్యవసాయ రంగానికి ఊతమిచ్చి రక్షణ కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు తగ్గించి వేయడం వ్యవసాయాన్ని దివాలా తీయించడమేనని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించడమే పనిగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని ప్రకటనలో పేర్కొన్నారు. నిజంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయ రంగం పట్ల చిత్తశుద్ధి ఉంటే వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

భట్టిప్రోలు ప్రధాన రహదారి

సర్వేలతో సరి

ట్రాఫిక్తో గ్రామస్థుల అవస్థలు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



భట్టిప్రోలు ట్రాఫిక్లో చిక్కుకున్న ఇసుక ట్రాక్టర్

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు ప్రధాన రహదారి పనులు సర్వేలతో సరిపెడుతున్నారు. దీంతో గ్రామస్తులు ట్రాఫిక్తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్రమణలు తొలగించి రహదారులను విస్తరింపజేసేందుకు అటు అధికారులు, ఇటు పాలకులు ఆక్రమణ తొలగింపుపై దృష్టి సారించారు. భట్టిప్రోలు ప్రధాన రహదారిలో ఆక్రమణల తొలగింపు ఎప్పటికప్పుడు సర్వేలకే పరిమితం అవుతోంది కానీ ఆక్రమణలు తొలగించిన దాఖలాలు మాత్రం లేవు. ఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా రోడ్డు విస్తరించాలని సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన ప్రాంతాలకు హద్దులు గుర్తిస్తూ ఉంటారు. ఈ హద్దుల గుర్తింపుతో గ్రామస్తులంతా ఈ ఏడాది ట్రాఫిక్ సమస్య తీరుతుందని భావించేవారు. కానీ గ్రామస్తులు ఆశించిన విధంగా లేకపోగా కొన్ని రోజుల తర్వాత దాన్ని ఊసెత్తేవారే లేకపోవడం గమనార్హం. దీని వెనక ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ నాయకులు ఆక్రమలు తొలగించకుండా రహదారి విస్తరణను అడ్డుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రంగా ఉన్న భట్టిప్రోలులో దాదాపు 20 వేలకు పైగా జనాభా పెరిగింది. దీనికి తోడు వాహనాల వినియోగం కూడా ఎక్కువ కావడంతో ప్రధాన రహదారిలో వ్యాపార దుకాణాలు, గ్రామాల నుంచి వచ్చే వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉంటోంది.

గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఆనాటి ఎమ్మెల్యే మాజీమంత్రి మెరుగు నాగార్జున రహదారి విస్తరణకు ఆక్రమణలు తొలగింపజేసి విస్తరించాలని సర్వే నిర్వహించారు. అంతకుముందు కూడా టిడిపి ప్రభుత్వ పాలల్లో ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆనందబాబు హయాంలో కూడా ఒకసారి రహదారి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలు మొత్తం బుట్టదాఖలు అయ్యాయి. ఆక్రమణలు తొలగించి రహదారులను విస్తరించి ప్రజల రాకపోకలకు ఆటంకాలను తొలగించేందుకు సిద్ధపడకపోవడం విచారకరం. సర్వే జరిగిన అనంతరం వ్యాపార సంస్థలు నిర్వహించే యజమానులు అధికారులకు కొంత సొమ్మును ఇచ్చి ఆక్రమణలు తొలగించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ప్రధాన సమస్యపై ఎందుకు దృష్టి సారించరు?

భట్టిప్రోలు జనాభా పెరుగుతున్నంత రీతిలో అభివృద్ధి మాత్రం జరగటం లేదు. దీనికి కారణం క్రీస్తు పూర్వం నుంచే ఏర్పడిన భట్టిప్రోలు గ్రామం రహదారులు ఇరుకుగా ఉండటమే. అధికార పార్టీ నాయకులు వేరే పార్టీ వారి దుకాణాలు మాత్రమే తొలగిస్తున్న ఘటనలు ఉన్నాయి. బుధవారం పల్లికోనలో జరిగిన ఆక్రమణ తొలగింపు కూడా ఇలాగే జరిగినట్లు స్పష్టమవుతోంది. సాయంత్రం నాలుగైతే చాలు అయితే ప్రైవేటు బస్సుల రాకపోకలతో గంటపాటు ట్రాఫిక్ సమస్య ఉంటోంది. అక్కడనుండి వివిధ పనులపై వచ్చే వరితో రాత్రి 8 గంటల వరకు భట్టిప్రోలు ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఈసారైనా భట్టిప్రోలు ప్రధాన రహదారిని విస్తరించేదుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న దృశ్యం

విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం, డిగ్రీ కాలేజీ బైపాస్ జంక్షన్ వద్ద శ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీ పల్నాటి అంకమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పవిత్ర నదీ జలాలతో, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారిని అభిషేకించి శుద్ధిచేసి, షాడషోపచార పూజా విధానాలతో పూజించి ప్రతిష్ఠ చేశారు. అనంతరం లోక కళ్యాణార్థం పవిత్ర యజ్ఞ యాగాదులతో ప్రత్యేక పూజ విధానాలు కూడా నిర్వహించి, సుమారు 5 వేల మందికి అన్నసంతర్పణ కూడా చేశారు. జిల్లాలోని నలుమూలల నుంచి కూడా భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నారు. అన్నసంతర్పణ కార్యక్రమంలో చీరాలలోని చైతన్య భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని సేవలందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆలయ ప్రెసిడెంట్ స్వర్ణ వీర రాఘవులు, దేవరంపాటి శ్రీనివాసరావు, వసంత చెన్నకేశవరావు, భీమవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీ వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న న్యాయవాది జమ్మద్ భాష

బాపట్ల అంజుమన్ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించినట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్ జానీ తెలిపారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంజుమన్ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రహీం జానీ మాట్లాడుతూ అంజుమన్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 158 మంది వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. అంజుమన్ సంస్థ అనేది ఒక సేవా దృక్పథంతో బాపట్ల పట్టణంలోని పేద వారికి అండగా నిలుస్తుందన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. సీనియర్ న్యాయవాది జమ్మద్ భాషా మాట్లాడుతూ అంజుమన్ ఇస్లామియా కమిటీ సేవా కార్యక్రమాలతో నిరుపేదలకు సహాయం అందించడంలో ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం, పట్టణ టిడిపి అధ్యక్షులు గొలపల శ్రీనివాస రావు, సీనియర్ న్యాయవాది జమ్మద్ భాష, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ, అంజుమన్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' వాల్పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీరాల

ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 7న చలో హైదరాబాద్, లక్షల డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులు ఆదివారం అంబేద్కర్ భవన్ వద్ద గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు వంగెవరపు రమేష్, బొంత అంకయ్య, దుడ్డు ఆశీర్వాదం పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చీరాల

పత్రికా రంగంలో సీనియర్ పాత్రికేయులుగా తుది శ్వాస విడిచే వరకు అంకితభావంతో పనిచేసిన జర్నలిస్టు సాంబశివరావు కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. సీనియర్ జర్నలిస్టు కొల్లిమర్ల సాంబశివరావు గత నెల 19న గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆమోదగిరి పట్టణంలో ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన పెద్దకర్మ కార్యక్రమానికి ఆయన హాజరై సాంబశివరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో తన వంతు బాధ్యతగా పత్రికా రంగంలో ఎంతో అనుభవం కలిగిన సీనియర్ పాత్రికేయులు సాంబశివరావు మృతి చాలా బాధాకరమని అన్నారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉండి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు డేటా నాగేశ్వరరావు, పిక్కి నారాయణ, జంగిలి రాములు, పలువురు కూటమి నాయకులు ఉన్నారు.



సీనియర్ పాత్రికేయులు సాంబశివరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

'ఫీజు పోరు'ను జయప్రదం చేయాలి

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన 'బూచేపల్లి'

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 5న ఒంగోలులో జరిగే ఫీజు పోరును జయప్రదం చేయాలని వైసిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పేద విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారన్నారు. తద్వారా అనేకమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి డాక్టర్లు, ఇంజనీర్లుగా ఇతర దేశాల్లో కూడా స్థిరపడ్డారని గుర్తు చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత నాడు-నేడు ద్వారా పాఠశాలల బలోపేతానికి కృషి చేశారన్నారు. విద్యాభివృద్ధి కోసం ఇంగ్లీష్‌మీడియం ఏర్పాటు చేసి సిబిఎస్ సిలబస్‌ను ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లను ఇచ్చి అవసరమైన సదుపాయాలను కల్పించాలన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోనికి వచ్చిన తరువాత, ఫీజ్ రియంబర్స్‌మెంట్, విద్యా దీవెన ఇవ్వకుండా రూ.3900 కోట్ల బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో నారాయణ కళాశాలలో చదివే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా కూడా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 5న ఫీజు పోరు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫీజు పోరు కార్యక్రమంలో భాగంగా ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కావున పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసిలు నుసుం నాగిరెడ్డి, రత్నంరాజు, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, నాయకులు కుమిత అంజిరెడ్డి, కెవి.రెడ్డి, సూర్యదేవర అంజయ్య, కాకర్ల క్రిష్ణారెడ్డి, మేడికొండ జయంతి, చింతలపూడి శ్రీనివాసరెడ్డి, బొల్లా భాస్కర్, కుందురు నరసింహారెడ్డి, సోము దుర్గారెడ్డి, ఇత్తడి దేవదానం, దేవప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ముత్తినీడు సాంబయ్య పాల్గొన్నారు.

పెండింగ్‌లోని ఆర్థిక బకాయిలు చెల్లించండి

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉపాధ్యాయులకు పెండింగ్‌లోని ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా ఇప్పటివరకు ఏ ఒక్క ఆర్థిక బకాయిలను మంజూరు చేయలేదన్నారు. 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయలేదని, కమిటీ ఆలసమైతే 29 శాతం మధ్యంతర భృతి అయినా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలంలోని డిఏ బకాయిలు, సరెండర్ లీవు బకాయిలను మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైనా ఆర్థిక బకాయిల సమస్యలను పరిష్కరించకపోవటంతో రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాట బాట పడతామన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాల మూత పడకుండా జీవో నెంబర్ 117ను రద్దుచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యాశాఖ వ్యవస్థను గాడిలో పెడతామని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పటం హర్షణీయమని, యుటిఎఫ్ స్వాగతిస్తుందన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు యం.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థ పటిష్ఠంగా ఉండాలంటే రాష్ట్రంలో జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని, ఏ ఒక్క పాఠశాలనూ మూతవేయకూడని పేర్కొన్నారు. సమావేశంలో యు.టి.యఫ్ జిల్లా నాయకత్వం, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆడిట్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్స్, కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్స్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేస్తే సహించం

- ప్రజా సమస్యలపై బూచేపల్లి అసెంబ్లీలో చర్చించాలి
- జనసేన జిల్లా అధ్యక్షులు రియాజ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వైసిపి నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వైసిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక గుంటూరు రోడ్డు లోని రవిప్రియా మాల్‌లో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో బూచేపల్లి తీరు పట్ల మండిపడ్డారు. ఈ సందర్భంగా షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై శివప్రసాద్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో మాట్లాడాలని సూచించారు. మాజీ మంత్రి బాలినేని ఆధ్వర్యంలో ఒంగోలుకు చెందిన పలువురు కార్పొరేటర్లు పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరుతున్న విషయంపై విలేకరుల అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి తమకు ఎటువంటి సమాచారం లేదని బదులిచ్చారు. తనతో కార్పొరేటర్లు ఎవరూ టచ్‌లో లేరని, పార్టీలో ఎవరయినా చేరవచ్చని తెలిపారు. పవన్‌కళ్యాణ్ సారథ్యంలో అంతిమంగా అందరూ పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. రవిశంకర్ గ్రూపు అధినేత, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్ మాట్లాడుతూ దేశం ఆంధ్ర ప్రదేశ్ వైపు చూస్తుందంటే అది ఒక్క పవన్ కళ్యాణ్ ద్వారానే సాధ్యమైందని తెలియజేశారు.



మాట్లాడుతున్న రియాజ్

కందుకూరు నియోజకవర్గం

త్వరలోనే 'ప్రకాశం'లో విలీనం

- జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- త్వరితగతిన వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం
- ఒంగోలు డెయిరీ పునరుద్ధరణకు చర్యలు
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- ఘనంగా ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవ వేడుకలు




మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి



అతిథులను సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రామాయపట్నం పోర్టు, హార్టికల్చర్ యూనివర్సిటీ ఉన్న కందుకూరు నియోజకవర్గం త్వరలోనే ప్రకాశం జిల్లాలో విలీనమవుతుందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. భిన్న పరిస్థితులు ఉన్న జిల్లాను అన్ని విధాలుగా అభివద్ధి చేయటంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టిందన్నారు. ప్రకాశం జిల్లా 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం భవనంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.విజయ్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రీవెన్స్ హాలులో జరిగిన వేడుకలలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు, శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నీటిపారుదల, పారిశ్రామిక రంగాలలో అభివద్ధి చేసి, జిల్లా నుంచి వలసలు వెళ్లకుండా స్థానికంగానే యువతకు ఉపాధి కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం దష్టి పెట్టిందన్నారు. విస్తారంగా ఉన్న భూములను ఈ విధంగా వినియోగంలోకి తెస్తామన్నారు. నదులను అనుసంధానం చేయటంపై రాష్ట్ర ప్రభుత్వం దష్టి పెట్టిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడంతో పాటు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా జిల్లాలో అవసరమైన చోట చెక్ డ్యాముల నిర్మాణాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బేస్తవారిపేట నుంచి ఒంగోలుకు నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను ఈ ఏడాదే ప్రారంభిస్తామన్నారు. పర్యాటక, ఆక్వా, గ్రానైట్ పరిశ్రమ రంగాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని మంత్రి తెలిపారు. ప్రకాశం యూనివర్సిటీ, ఒంగోలు డెయిరీ పైనా ముఖ్యమంత్రి దష్టి సారించినట్లు చెప్పారు. ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటుతో పాటు చిన్న, సూక్ష్మ పరిశ్రమలను మరింత అభివద్ధి చేస్తామన్నారు. స్థానికంగా ఉన్న భౌగోళిక, మానవ వనరులను అందిపుచ్చుకొని జిల్లాను సమగ్రంగా అభివద్ధి చేస్తామని తెలిపారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విజన్ - 2047 లో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావించిన పది సూత్రాలను పరిగణనలోకి తీసుకొని ఆ కోణంలో జిల్లాను అభివద్ధి చేస్తామన్నారు. భౌగోళికంగా రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా అతి పెద్దదని, ఈ దిశగానే జిల్లా విజన్ డాక్యుమెంటును రూపొందించామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జిల్లాకు తలమానికమైన వెలిగొండ ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో జిల్లాను అభివద్ధి పరంగా ముందుకు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిన్ విజయకుమార్ మాట్లాడుతూ గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల నుంచి వెనకబడిన ప్రాంతాన్ని వేరు చేసి ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. ఆ వెనుకబాటుతనాన్ని అధిగమించి అభివద్ధిలో దూసుకువెళ్లేలా చూడాల్సిన బాధ్యత జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్ఫూర్తితో జిల్లాను అభివద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. సువిశాలమైన తీర ప్రాంతాన్ని, వివిధ సందర్శనీయ ప్రదేశాలను అభివద్ధి చేసి పర్యాటకంగా ప్రకాశం పరిఢవిల్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా అభివద్ధికి ఒక గ్రోత్ ఇంజన్ అయిన ఆక్వా రంగం పురోగతి సాధించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మాల ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకాశం జిల్లాలోనే అధిక సంఖ్యలో దళితులు ఉన్నారని, వారి సమగ్ర అభివద్ధికి ప్రభుత్వం దష్టి సారించిందన్నారు. వలసలను నివారించి వారికి స్థానికంగానే ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ కమిషన్ వైస్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో జిల్లా గొప్ప ముందడుగు వేసేలా ఈ ఆవిర్భావ వేడుకల్లో ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులతో పాటు వివిధ రంగాలలో ప్రతిభ చాటి జిల్లా ఖ్యాతిని పెంచిన పలువురిని ఈ సందర్భంగా అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిఆర్ఒ బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న కదిరి బాబురావు

వధూవరులకు 'కదిరి' ఆశీర్వాదం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని శీలంవారిపల్లె గ్రామానికి చెందిన కొట్టే నారాయణ కుమారుడు మిథున్ కుమార్, విన్ని వివాహ వేడుక ఆదివారం హైదరాబాద్‌లోని మహేంద్ర ఎలైట్ వెడ్డింగ్ హాల్స్‌లో ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ శాసన సభ్యులు కదిరి బాబురావు హాజరై నూతన వధూ, వరులను ఆశీర్వదించారు. వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కదిరి బాబురావు విద్యాసంస్థల చైర్మన్ కెవి ప్రకాశ్‌రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, కదిరి పిచ్చయ్య, కదిరి కృష్ణ, కొట్టే శ్రీను, తికనం బాబురావు, నున్నా నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ఒ సుధాకరరావు

లోకోస్ యాప్‌పై ఇఒఎలకు శిక్షణ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

భవిష్యత్తులో డిజిటలైజేషన్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు సాధికారత కల్పించాలనే ఎన్ఆర్ఎల్ఎం దృష్టిని సహకారం చేయుటలో లోకోస్ యాప్ కీలకమని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని మార్కాపురం ఏరియా కోఆర్డినేటర్ ఓ సుధాకర్‌రావు అన్నారు. మండల మహిళా సమైక్య భవనంలో కొనకనమిట్ల, పొదిలి మండలాల విఓఎలకు శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచడమే లోకోస్ యాప్ ముఖ్య ఉద్దేశమన్నారు. పొదుపు సంఘాలకు జీవనోపాధి, అభివృద్ధిని సులభంగా సంఘాలకు ఆర్థిక సహాయం అందించడానికి వీలుపడుతుందని అన్నారు. ఆర్థిక లావాదేవీలు, ప్రతి నెలా అప్‌డేట్ చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్టేట్ రీసోర్స్‌పర్సన్స్‌గా ఎంపిక కాబడిన ఇద్దరు అనుభవజ్ఞులైన సుజాత, మోబీనా, సిఆర్‌పిలు, ఇఓఎలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కొనకనమిట్ల, పొదిలి మండలాల ఎపిఎంలు బి సుధాకర్‌రావు, కె గోపాలకృష్ణరెడ్డి, ఎల్‌సి నాగభూషణం, మహిళా సమైక్య మండల అధ్యక్షులు ఎంబడి ఈశ్వరమ్మ, సిసిలు సాయిలు, లక్ష్మిరెడ్డి, యు రాజయ్య, వెంకట్‌రెడ్డి, అకౌంటెంట్లు, పొదిలి, కొనకనమిట్ల విఓఎలు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న సిఐ టి వెంకటేశ్వర్లు

బదిలీ అయిన పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి - పొదిలి

స్థానిక పోలీసు స్టేషన్లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఐదుగురు ఉద్యోగులను ఆదివారం స్టేషన్ ఆవరణలో సిఐ టి వెంకటేశ్వర్లు, ఎస్ఐ వి వేమన ఘనంగా సత్కరించారు. వారు చేసిన సేవలను గుర్తు చేసి అభినందించారు. బదిలీ అయిన ఉద్యోగులు పూర్ణచంద్రరావు, బాల మురళి, అమీర్ వలి, భరత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 'వద్దిమడుగు' పాఠశాల

- మూడు గదుల్లో 125 మంది విద్యార్థులు
- నిధులు కొరతతో అసంపూర్తిగా నిలిచిన భవనం
- సతమతమవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని వద్దిమడుగు యూపీ పాఠశాల అనేక సమస్యలతో సతమతమవుతోంది. పాఠశాలలో 125 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పేరుకే నాలుగు గదులు. నాలుగు గదులకు గాను ఒక గది ప్రధానోపాధ్యాయుని కార్యాలయం అయినప్పటికీ అందులో ఒక తరగతిని నిర్వహిస్తున్నారు. ఆ గదిలోనే మధ్యాహ్న భోజనంకు సంబంధించిన వస్తువులు ఒక మూలన ఏర్పాటు చేయక తప్పు లేదు. దీంతో విద్యార్థులకు గదులు సరిపడక వారి ఇబ్బందులు వర్ణాను తీతం. అందరూ పక్క పక్కన కూర్చోవడం వల్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు సరిగా అర్థం కాక నాన అవస్థలు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా మరో నాలుగు గదులు అవసరమని ప్రభుత్వం గుర్తించి నాడు-నేడు కింద రూ.48లక్షలు నిధులు అవసరమని అంచనా వేశారు. మొదటి విడతగా రూ.24 లక్షలు మంజూరు అయ్యాయి. ఆ నిధులతో నాలుగు గదులు నిర్మాణం చేపట్టి పైనస్లాబు వేసి అసంపూర్తిగా వదిలివేశారు. పనులు చేపట్టిన గుత్తేదారు ఇప్పటికీ రూ.24లక్షలను నిర్మాణానికి ఖర్చు చేయడం జరిగిందని, బ్యాంక్ అకౌంట్లో రూ.1.50లక్షల నిధులు ఉన్నాయని తెలిపారు. అన్ని పనులు పూర్తిస్థాయిలో చేయాలంటే మరో రూ.24 లక్షలు అవసరమని, నిధులు లేకుండా పనులు ఎలా చేయాలో అర్థం కాక పనులను



అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు గదులు

అసంపూర్తిగా నిలిపివేసినట్లు గుత్తేదారు తెలిపారు. దీంతో విద్యార్థులు నానఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతకు అప్పుడప్పుడు కురిసే వర్షాలకు విద్యార్థులు, ఉపాధ్యాయుల బాధలు చెప్పేవి కావు. పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు చేపట్టాలంటే మరో రూ.24 లక్షలు అవసరమని తెలిపారు. పనులు పూర్తి చేస్తే తమకు బిల్లులు వస్తాయో రావో తెలియని పరిస్థితి ఉందని కాంట్రాక్టర్ అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పనులు ప్రారంభమై మూడేళ్లు అయ్యింది. నిర్మాణం పూర్తి కావాలంటే ఎన్నేళ్ల పడుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతుందేమోనని, సంఖ్య తగ్గితే మోడల్ స్కూల్‌గా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 150 మందిపైగా విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల నేడు 125కు చేరింది. అంతే కాకుండా పాఠశాలకు గ్రౌండ్, 6, 7, 8 తరగతులకు సౌకర్యాలు లేవు. ఈనెల 20న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని సభ దృష్టికి ఎంపిటిసి చక్కెర వెలుగొండ తీసుకొచ్చారు. ఉన్నతాధికారులు తమ పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి నిలిచిపోయిన పనులకు నిధులను మంజూరుకు చేయించి అసంపూర్తిగా నిలిచిన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బాసటగా నిలవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.



అసంపూర్తి అదనపు గదిలో ఉన్న ఇనుము, ఇసుక

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-దర్శి

ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక డాక్టర్ అంబేద్కర్ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షులుగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండలరావు అధ్యక్షత వహించగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జికూటివ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. 1970లో ఒంగోలు జిల్లాగా వున్న పేరును మార్చి, 1972లో ప్రకాశం జిల్లా నామకరణానికి కారణభూతులైన ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు గిత్తలతో మార్కాపురం పలకలతో చీమకుర్తి గెలాక్షీ



మాట్లాడుతున్న మానవత సంస్థ కన్వీనీర్ కపురం శ్రీనివాసరెడ్డి

గ్రానైట్‌తో ప్రపంచ ప్రఖ్యాతిఘడించిందని అన్నారు. ఆసియాఖండంలోనే మన కంభం చెరువు అతిపెద్దదని అన్నారు. పర్యాటక రంగంలో సముద్ర తీర ప్రాంత బీచ్‌లు, ప్రకృతి సోయగాలతో మనసును పులరింపజేసే భైరవకోన, నెమలిగుండ్ల రంగస్వామి గుండం, చందవరం భౌద్ధస్తూపాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయని అన్నారు. ప్రపంచ దేశాలు గర్వపడేవిధంగా భారతదేశ జాతీయ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, కవి యర్రాప్రగఢ, ఆధునిక సాంకేతిక నిపుణులు, ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, శాస్త్రీయ సంగీత పితామహుడు త్యాగరాజు, ఇంకా ఎందరో మహానుభావులు, స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రాంతం ప్రకాశం జిల్లా అని, మన జిల్లా కీర్తి ప్రతిష్ఠలను ఎల్లప్పుడూ మననం చేసుకుంటూ వుండాలని విద్యార్థులకు సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సుశీలమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా: ఎస్పీ

ప్రజాశక్తి-కంభం

జిల్లాలో నేరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నేరాలు నియంత్రణ,అసాంఘిక కార్యకలాపాలపై మారుమూల ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ దామోదర్ తెలిపారు. కంభం మండలం, కందులాపురం గ్రామానికి చెందిన కేతం శ్రీనివాసులు (ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ప్రెసెంట్ మరియు సభ్యులు) ఆదివారం కంభం పోలీస్ స్టేషన్ లో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కి అత్యాధునిక సాంకేతికత కూడిన ఒక డ్రోన్ కెమెరాను అందజేశారు. ప్రకాశం జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో పోలీస్ శాఖకు ఒక డ్రోన్ ను బహుకరించడం అభినందనీయమని జిల్లా



ఎస్పీకి డ్రోన్ కెమెరాను అందజేస్తున్న దృశ్యం

ఎస్పీ పోలీస్ శాఖ తరుపున వారికి కృతజ్ఞతలు తెలిపార్ను. ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు/నిశిత ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ విఐపి ల బందోబస్తులలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయలు జరగకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించడం జరుగుతుందని, ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్స్ వినియోగంపై పోలీస్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్పీ వెంట మార్కాపురం డిఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కంభం సీఐ మల్లికార్జున రావు, గిద్దలూరు సీఐ రామకోటయ్య, కంభం ఎస్సై నరసింహా రావు మరియు సిబ్బంది ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

వెంకటకృష్ణకు ఎమ్మెల్యే ఏలూరి నివాళి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరామర్శించారు. ఆదివారం పర్చూరు విచ్చేసిన ఎమ్మెల్యే వెంకటకృష్ణ భౌతిక కాయాన్ని దర్శించి పూలమాల సమర్పించి నివాళు లర్పించారు. వీరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. అనంతరం వెంకటకృష్ణ అంతిమయాత్రలో ఎమ్మెల్యే ఏలూరి, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణతో ఇబ్బందులు

ప్రజాశక్తి- భట్టిప్రోలు

దారి ఆక్రమణతో ఇళ్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని భట్టిప్రోలు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు బౌద్ధ స్తూపంను అనుకుని సుమారు మూడు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో 27 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ భూములకు ఉన్న ప్రధాన పంట కాలువను పూడ్చివేసి పక్కన ఉన్న సమీప రైతు ఆక్రమించుకొని ధాన్యం గోదామును నిర్మించుకున్నాడు. ప్రస్తుతం సాగు చేసుకునే వీలులేని ఈ భూమిలో మెరక తోలుకొని నివాస గృహాలు ఏర్పాటు చేసుకోవాలంటే ఈ భూములకున్న పంట కాలువే ప్రధాన రహదారి. దీనిని సమీపంలోని మల్లేశ్వరరావు అనే రైతు ఆక్రమించుకోవడంతో భూముల్లోకి వెళ్లే మార్గం లేక నిరుపయోగంగా మారాయి. దీంతో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధుల ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేసి పంట కాలువను గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. అయితే ఈ భూమిలో మరుగుదొడ్లు, ప్రహరీ గోడ నిర్మించాడు. దీనిని తొలగిస్తే ఆ మూడెకరాల్లో ఉన్న లబ్ధిదారులందరూ రహదారిని ఏర్పాటు చేసుకొని గృహాలు నిర్మించుకుంటామంటూ అధికారులను వేడుకుంటున్నారు. ఆక్రమణదారుడికి నోటీసులు జారీ చేసి తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే నక్క ఆనందబాబు దృష్టికి తీసుకువెళ్లగా న్యాయం జరిగే విధంగా చూస్తానన్నారు.



దారి లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న భూములు



సర్వే అధికారులతో మాట్లాడుతున్న బాధితులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మంత్రి గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి-పంగులూరు

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్న మల్లవరం, బూధవాడ గ్రామాల్లోని పలువురు టీడీపీ కార్యకర్తలను ఆదివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ముందుగా చిన్నమల్లవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిలుకూరి అనంతరామయ్య, చిలుకూరి వాసు బాబు, వాడపాటి చిన్న అంజమ్మ, వెల్లటూరి వెంకటేశ్వర్లులను మంత్రి రవికుమార్ వారి గృహాలకు వెళ్లి పరామర్శించారు. బూదవాడలో గుండెపోటుతో మరణించిన గూండా సాంబశివరావు, చేజర్ల వీరస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల తెలుగు యువత అధ్యక్షులు భవనం వెంకటరామిరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, మాజీ డైరీ చైర్మన్ బాలిన రామ సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ కర్రీ వెంకట సుబ్బారావు, మండల ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, గుదిబండ్ల ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఏబీ వెంకటేశ్వరరావుకు ఎన్టీఆర్ జీవిత సాఫల్య అవార్డు ఇస్తున్న దృశ్యం

5న జిల్లాస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 5వ తేదీన బుధవారం జిల్లా స్థాయి క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు మత్తి శివశంకరరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మత్తి భాస్కరరావు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం గుంటూరు మరియు మత్తి శివ శంకరరావు ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలలో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ 100 మీటర్లు, షాట్ పుట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మత్తి శివ శంకరరావు ట్రస్ట్ చైర్మన్ మత్తి భాస్కరరావు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పాల్గొనదలచిన క్రీడాకారులు వ్యక్తిగతంగా గాని, లేదా టీములు వారీగా గాని నిర్వాహకులు 8500067604 నెంబరులో సంప్రదించవలసిందిగా కోరారు.

తెలుగు జాతి పునరుద్ధరణకు కృషి చేయాలి

ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఏబీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

తెలుగు జాతి పునరుద్దరణకు మనమందరం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ కార్పొరేషన్ చైర్మన్ ఏబీ వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. పివిఆర్ గ్రౌండ్స్‌లో ఎన్‌టీఆర్ కళా పరిషత్ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ రచయిత కందిమల్ల సాంబశివరావు అధ్యక్షతన వెల్ విషర్ శంకర్ వ్యాఖ్యతగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న తెలుగు సంస్కృతిని కాపాడుతున్న కళా పరిషత్ చేస్తున్న కృషి సాహసోపేత చర్యగా అభివర్ణించారు. తెలుగు భాషను కాపాడేందుకు, తెలుగు జాతి పునరుద్ధరణకు శాసనసభ్యులు చొరవ చూపాలని సందర్భంగా దామచర్ల జనార్ధన్, బిఎన్ విజయ్ కుమార్‌కు సూచించారు. విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు సాహిత్యం, విప్లవ సాహిత్యం అభ్యుదయ సాహిత్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళలను ఆదరించటంలో ప్రకాశం జిల్లా వాసులు దేశానికి మార్గదర్శకులని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ స్కాలర్ షిప్ వెబ్‌సైట్, పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ ప్రజలకు సందేశాన్ని అందించే కళా ప్రదర్శనలు కొనసాగించటం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ కళా ప్రదర్శనల ద్వారా సంస్కృతి సంప్రదాయాలను కాపాడడం హర్షనీయమన్నారు. ప్రముఖ సాహితివేత్త ఆచార్య అప్పా జ్యోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ కళా పరిషత్ నిర్వాహకులు ఇదర హరిబాబు దీక్ష శ్లాఘనీయమని కొనియాడారు కార్యక్రమంలో ముత్తవరపు సురేష్ బాబు, ప్రముఖ రచయిత డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు ఈ దర హరిబాబును ప్రశంసించారు. తొలుత ప్రముఖ సాహితీవేత్త అప్పాజ్యోసుల సత్యనారాయణను కళాపరిషత్ నిర్వాహకులు "ఎన్టీఆర్ జీవిత సాఫల్య సాధన పురస్కార" అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చందు డాన్స్ అకాడమీ వారు ప్రదర్శించిన కళారూపాలు, ఎనిమిది వేదికలపై ప్రదర్శించిన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. నాదస్వరం, కోలాట ప్రదర్శనలు ఉత్సాహపరిచాయి. కార్యక్రమంలో ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావు పేస్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ మద్దిశెట్టి శ్రీధర్, నాగేశ్వరరావు, బెజవాడ వెంకట్రావు,అన్నం నేని ప్రసాదరావు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. గత 15 రోజులుగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న విజేతలకు జ్ఞాపికలను అందించారు. అనంతరం చందు డాన్స్ అకాడమీ వారు ప్రదర్శించిన "శ్రీనివాస కళ్యాణం" తిరుపతి తిరుమల బ్రహ్మోత్సవాలను తలపించింది.



అలరించిన కళాకారుల నృత్య ప్రదర్శన

మాజీ ఎమ్మెల్యే రాఘవరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - మెదరమెట్ల

అద్దంకి మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు ఆరో వర్ధంతి కార్యక్రమా న్ని కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పమిడిపాడు గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రజ లకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. ఎవరికైనా మోకాలు ఆపరేషన్ అవస రమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ మనోజ్ తెలిపారు. జాగర్లమూడి రాఘవరావు తన రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రారంభించారని ఆయన మనవరాలు విక్రమ్ తులసి చెప్పారు. 1983లో కాం గ్రెస్ తరపున సొసైటీ ప్రెసిడెంట్‌గా గెలుపొందారన్నారు. తదనంతరం గ్రామ సర్పంచిగా గెలుపొందారు అని చెప్పారు. 1989వ సంవత్సరంలో ఎమ్మెల్యేగా గెలుపొందారని, 1994,1999,2004 ఎమ్మెల్యేగా పోటీ చేశారన్నారు. రాజకీ య జీవితంలో ప్రజలకు జాగర్లమూడి రాఘవరావు ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. గుండ్లకమ్మ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా కొరిశపాడు మండల ప్రజలకు అందించడంలో ఆయన కృషి చేశారని తెలిపారు. అలాగే పమిడిపాడు పాఠశాల అభివృద్ధికి కూడా కృషి చేశారని ఆమె చెప్పారు.



జాగర్లమూడి రాఘవరావుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

రేణంగివరంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు

ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవ సందర్భంగా పంగులూరు మండలం రేణింగవరంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైటల్ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ శిబిరానికి సహకారం అందించిన బోరెడ్డి ఓబుల్ రెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైటల్ హెల్త్ కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజేష్, వందనం, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రామలింగారెడ్డి, మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి, జాయ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం ప్రముఖ వ్యక్తిత్వ వికాసకులు జాలాది మోహన్ పిల్లలకి మోటివేషన్ కథలు భోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకులు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది యస్.అనిల్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలాజీ

ముద్ర రుణాలపై బ్యాంకర్ల ఆంక్షలు తగదు

చేనేత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చేనేత కార్మికులకు రుణాలను మంజూ రు చేసే విషయంలో బ్యాంక్ అధికారులు ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురి చేయటం దారుణమని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మండిపడ్డారు. భట్టి ప్రోలులోని ఏపీ చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు సహకార సంఘాల ద్వారా కార్మికుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను భట్టిప్రోలులోని బ్యాంకుకు పంపగా వాటిని పరిశీలించిన బ్యాంకు మేనేజర్ గత ఆరు నెలలుగా లావాదేవీలు జరుగుతున్న వారికి మాత్రమే రుణాలు మంజూరు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసేలా కలెక్టర్, జౌళి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామ కోట్టేశ్వరరావు, సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, చేతివృత్తిదారులు సమాఖ్య సభ్యులు వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎబిఎం ఆస్తుల క్రయవిక్రయాలన్నీ..

కోర్టు సూచించిన కమిటీ పర్యవేక్షణలోనే..

- తాజాగా తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోర్టు.!
- కోర్టు తీర్పుతో గతంలో కొనుగోలుదారులకు ఊరట..

ప్రజాశక్తి-మార్కాపురం


'ఎబిఎం' ఆస్తుల అమ్మకాలు, కొనుగోళు చేసిన వారందరికీ మొన్నటివరకు కొంత భయం ఉంది. కొనుగోలు చేసిన భూమిలో కొందరు కట్టడాలు పూర్తి చేసి నివాసాలు ఉంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విధంగా కొనుగోలు చేసి, నివాసాలు ఏర్పరచుకున్న ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. మార్కాపురంలో కూడా పై విధంగా కట్టడాలు వెలిశాయి.

ఎబిఎం ఆస్తులను కొల్లగొట్టేందుకు కొన్ని సొసైటీలు పుట్టుకొచ్చాయి. ఎబిఎం ఆస్తులు తమకే చెందాలని మద్రాస్‌లోని హై కోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణ అనంతరం కొనుగోలుదారులకు, నివాసితులందరికీ ఊరట కలిగించేలా తాజాగా తీర్పు వెల్లడించింది. ఇకపై జరిగే క్రయవిక్రయాలన్నీ కోర్టు సూచించిన మేరకు కమిటీ నియమించుకోవాలని, తద్వారా మాత్రమే క్రయ, విక్రయాలు జరగాలని ఆదేశించడం గమనార్హం.

ఎబిఎం ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు రిజిస్ట్రేషన్ వ్యవహారాలు మొన్నటివరకు అధికారులను ఇరకాటంలో పడేశాయి. మద్రాస్ హై కోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో సబ్ రిజిస్ట్రార్‌లు వాస్తవ పరిస్థితులను పరిశీలించే దిశగా అడుగులు వేస్తున్నారు. మద్రాస్ హైకోర్టు గత డిసెంబర్ 14న సిఎస్ నెంబర్ 124/1994పై ఇచ్చిన ఉత్తర్వుల్లో ఇచ్చిన అంశాలను సబ్ రిజిస్ట్రార్‌లు అధ్యయనం చేసే పనిలో ఉన్నారు. ఈ సమస్య మార్కాపురం వరకు పరిమితం కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎబిఎం ఆస్తుల విషయంలో సమస్యలున్నాయి.

ఎబిఎం ఆస్తులపై గతంలో హక్కులు కలిగి ఉన్న అమెరికన్ ఫారిన్ బాప్టిస్ట్ విషన్ సొసైటీ (ఎఎఫ్‌బిఎంఎస్), ది ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చిస్ (పిఎబిసి), సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చిస్ (ఎన్‌టిబిసి) మధ్య జరుగుతున్న ఈ వ్యవహారంపై మూడు దశాబ్దాల తరువాత మద్రాస్ కోర్టు ఓ నిర్ణయానికి వచ్చింది.

ఇప్పటివరకు పిఎబిసి ఆధ్వర్యంలో జరిగిన వ్యవహారం సక్రమంగా వ్యవహరించలేదని, దుర్వినియోగం చేసినట్లు కోర్టు అభిప్రాయపడింది. ఎఎఫ్‌బిఎంఎస్ కూడా 30 ఏళ్ల తరువాత ఇప్పుడు ఇందులో ప్రవేశించడం సరిగా లేదని తప్పుబట్టింది.


C.S.No.124 of
IN THE HIGH COURT OF JUDICATURE AT MADRAS
RESERVED ON 20.09.2024
PRONOUNCED ON 19.12.2024
CORAM :
THE HON'BLE MR.JUSTICE K.KUMARESH BABU
C.S.No.124 of 1994 &
A.No.3863 of 2024, 5144 & 7395 of 2018 and 5753 & 5755 of 2001
1.D.Jayaraj
2.Ch.Yesuratnam(Died)
3.Rev.V.S.Moses (Died on 26.08.1997)
4.K.Paul (Died on 13.07.2016)
5.G.Vandanam (Died on 29.07.2021)
6.D.Anil Raju
7.D.Sunil Raju
... Plaintiffs
Plaintiffs 6 & 7 substituted as plaintiffs in place of deceased 1 Plaintiff as per order dated 01.11.2019 in Appl.No.8227 of 2019
vs.
1.The Property Association of Baptist Churches Private Ltd., by its Executive Director
2.The Samavesam of Telugu Baptist Churches by its General Secretary
3.Y.Shankar Rao
4.Y.Geetha
5.Y.Ashok
6.Y.Gopi
7.Y.Anitha
8.Y.Lalitha
9.J.Vijayalakshmi
10.Smt.S.Maniamma
1/40

డిసెంబరు 19న కోర్టు తీర్పు కాపీ

ఎపిబిసికి ఎబిఎం ఆస్తులపై హక్కులు ఉన్నాయని ఉత్తర్వుల్లో అభిప్రాయపడింది. పిఎబిసి తరపున మెరుగైన మేనేజ్‌మెంట్ కోసం ఒక కమిటీ వేసేందుకు కోర్టు కొన్ని సూచనలు చేసింది. 2024 డిసెంబర్ 19వ తేదీ నుండి ఆస్తుల అమ్మకం, కొనుగోలు విషయాల్లో ఎవరి ప్రమేయం ఉండకూడదని పేర్కొంది. ఇకపై ఏది జరిగినా కోర్టు పరిధిలోని కమిటీ సమక్షంలో జరగాలని కోర్టు స్పష్టం చేసింది. ఇంతకు ముందు జరిగిన లావాదేవీలకు ఎటువంటి ఇబ్బంది లేదని కూడా కోర్టు పేర్కొంది.

విషయం ఏమిటంటే... అమెరికాలో రిజిష్టర్ కాబడిన ఎఎఫ్‌బిఎంఎస్ కాకుండా 1970లో మద్రాస్‌లో రిజిష్టర్ అయిన అదే పేరుతో సొసైటీ ఉందని, ఇప్పుడు తాజాగా కొంతమంది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్‌లు జరగాలని రిజిస్ట్రార్లపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. 1970లో రిజిష్టర్ జరిగితే 50 ఏళ్లుగా ఎందుకు ఆ సొసైటీ మౌనంగా ఎందుకుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మద్రాస్ కోర్టు పరిధిలో జరిగిన 124/1994 కేసులో ఎందుకు ఈ సొసైటీ ఇంప్లీడ్ కాలేదనేది ప్రశ్నార్థకంగా ఉంది.

గతంలో ఉన్న అమెరికన్ సొసైటీ కంపెనీ యాక్ట్ క్రింద రిజిష్టర్ కాగా... ఇక్కడిది సొసైటీ యాక్ట్ కింద రిజిష్టర్ కాబడింది. ఈ సొసైటీని కోర్టు తప్పుబట్టింది. మొత్తానికి కోర్టు ఉత్తర్వులు మేరకు ఇప్పటి నుంచి ఏది జరిగినా కమిటీ ఆధ్వర్యంలో జరగాల్సి ఉంది. క్రయ, విక్రయాల్లో ఒకవేళ వివాదాలు చోటు చేసుకుంటే కోర్టు సూచించిన కమిటీ వద్దనే పరిష్కరించుకోవాల్సి ఉంది. మద్రాస్ హైకోర్టు తాజా తీర్పుపై ఉన్నతాధికారులు ఓ నివేదిక తయారు చేసి స్పష్టత ఇస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇబ్బందులు తొలగవని కొందరు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-మద్దిపాడు

విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడిపై మద్దిపాడు పోలీస్‌స్టేషన్లో ఆదివారం పోక్సో కేసు నమోదయింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వెల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేట్ టీచర్‌గా పనిచేస్తున్న జి. రవికుమార్ అనే ఉపాధ్యాయుడు పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. వారి ఫిర్యాదు మేరకు సదరు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో

ఏఆర్ సిబ్బంది పాత్ర కీలకం

- వారి సంక్షేమం కోసం చర్యలు
- ఎస్పీ తుషార్ డూడి



'డీ మొబలైజేషన్' ముగింపు కార్యక్రమంలో ఎస్పీ తుషార్‌డూడీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ఏ.ఆర్ సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా సాయుధ పోలీసు బలగాలకు నిర్వహించిన 'డీ మొబలైజేషన్' ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి పోలీసు బలగాల ప్లటూన్లను పరిశీలించారు. ఆ తర్వాత ప్లటూన్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. పెరేడ్ మరియు బ్యాండ్‌ను చాలా చక్కగా ప్రదర్శించారని సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో సాయుధ బలగాలు ఉన్నాయన్నారు. ఏఆర్ సిబ్బందికి విధులలో నైపుణ్యం పెంపొందించడానికి ప్రతి సంవత్సరం మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వాటిని అదుపు చేయడానికి వెంటనే అక్కడికి సాయుధ బలగాలను పంపిస్తుంటామన్నారు. ఏ.ఆర్ సిబ్బంది సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బందిలో ఎవరికి ఏ సమస్య ఉన్నా తన దష్టికి తీసుకువస్తే వెంటనే తగు చర్యలు తీసుకొని సత్వరం పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. సబ్సిడీతో కూడిన వస్తు సరుకులు పొందటానికి పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్‌ను, షాపింగ్ కాంప్లెక్స్‌ను రాబోయే రోజులలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పెరేడ్‌ను క్రమశిక్షణతో చక్కగా నిర్వహించిన పెరేడ్ కమాండర్ ఆర్ఐ మౌలుద్దీన్‌ను జిల్లా ఎస్.పి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ డి.ఎస్.పి విజయ సారథి, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, సిసిఎస్ డీఎస్పీ – జగదీష్ నాయక్, డి.ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్, ఆర్ ఎస్సై లు, ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం


- ఫిబ్రవరి 28 లోగా లైఫ్ సర్టిఫికెట్ అందించాలి...
- తొలిసారి పెన్షన్ పొందేవారు స్వయంగా సంప్రదించాలి...
- జిల్లా ఖజానాధికారి ఏ.జగన్నాథరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా పరిధిలో లైఫ్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా ఖజానాధికారి ఏ.జగన్నాథరావు తెలిపారు. జిల్లాలోని పెన్షన్‌దారులు, సర్వీస్ పెన్షన్ దారులకు సంబంధించి ప్రతి ఏటా లైఫ్ సర్టిఫికెట్లు నమోదు చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని వివరించారు. ఈ ప్రక్రియతో ఎటువంటి అంతరాయం లేకుండా ఏడాది పాటు రిటైర్ అయిన ఉద్యోగులు, వారి కుటుంబీకులు పెన్షన్ పొందే వీలుందన్నారు. ఈ నేపథ్యంలో జగన్నాథరావుతో 'ప్రజాశక్తి' ముఖాముఖి.

జిల్లాలో 15,592 మంది పెన్షనర్లు..

జిల్లాలో 38 మండలాల పరిధిలో 714 పంచాయతీలు 612 సచివాలయ పరిధిలో ఎనిమిది సబ్ ట్రెజరీలున్నాయి. ఆయా సబ్ ట్రెజరీల పరిధిలో 15,592 పెన్షన్ దారులు ఫ్యామిలీ పెన్షన్లు ఉన్నారు. అత్యధికంగా ఒంగోలు సబ్ ట్రెజరీ పరిధిలో 7483, మార్కాపురం సబ్ ట్రెజరీ పరిధిలో 1074, గిద్దలూరు సబ్ ట్రెజరీ పరిధిలో 1642, కనిగిరి సబ్ ట్రెజరీ పరిధిలో 1330, కంభం సబ్ ట్రెజరీ పరిధిలో 1107, దర్శి సబ్ ట్రెజరీ పరిధిలో 969, పొదిలి సబ్‌ట్రెజరీ పరిధిలో



761, ఎర్రగొండపాలెం సబ్ ట్రెజరీ పరిధిలో 596 మొత్తం 15,592 పెన్షనర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో దాదాపు 90 శాతం పైగా లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి గావించారని తెలిపారు. జిల్లాలో ఏ ప్రాంతంలో నివసించినా, ఖాతా ఏ ట్రెజరీ లో ఉన్నప్పటికీ జిల్లాలోని ఏ సబ్ ట్రెజరీ నుంచైనా లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నమోదు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. తొలిసారి పెన్షన్ పొందేవారు మాత్రం ఆ సబ్ ట్రెజరీలోనే లైఫ్ సర్టిఫికెట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. మిగిలిన పెన్షనర్లు సబ్ ట్రెజరీల్లో గానీ, మీసేవ కేంద్రాల ద్వారా గానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సిఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులు..

జిల్లాలో వివిధ ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లకు సిఎఫ్ఎంఎస్ ప్రక్రియ ద్వారా వేతనాలు, పెన్షన్లు వారివారి ఖాతాలకు జమవుతున్నాయని తెలిపారు. సిఎఫ్ఎంఎస్ ప్రక్రియ మొదలుపెట్టిన అనంతరం బిల్లులు ఆమోదించటం వరకే ట్రెజరీ పరిధిలో ఉన్నట్లు వివరించారు. బిల్లులు మంజూరు, బిల్లులు చెల్లింపు ప్రక్రియ సిఎఫ్ఎంఎస్ ద్వారానే అమలవుతుందని, ఈ ప్రక్రియ వల్ల జవాబుదారీతనం పెరిగినట్లు వివరించారు.

కంప్యూటరైజేషన్ పద్ధతిలో సేవలు..

సిఎఫ్ఎంఎస్ ప్రక్రియతో పాటు ఉద్యోగుల ఈకేవైసీ, పెన్షనర్ల ఈ కేవైసీ వంటి ప్రక్రియను పేపర్ రహితంగా నమోదు చేస్తున్నట్లు వివరించారు. గతంలో ఈ ప్రక్రియ అంతా డాక్యుమెంట్ రూపంలో ఉండేదని, ఉద్యోగుల బదిలీలు సందర్భంలో డాక్యుమెంటేషన్‌కు జాప్యం జరిగేదని తెలిపారు. జాతీయ విపత్తులు ఏర్పడినప్పుడు రికార్డులు ధ్వంసం అవ్వడం, సమాచారం లభ్యం కాకపోవడం వల్ల సమస్యలు తలెత్తేవన్నారు. ప్రకతి వైపరీత్యాల వల్ల రికార్డులు పాడైనప్పుడు సమాచారం తిరిగి పొందటం కష్టంగా ఉండేదన్నారు. కంప్యూటరీకరణ పద్ధతి ద్వారా ఉద్యోగుల సమాచారం శాశ్వతంగా సంక్షిప్తం అయ్యే అవకాశం లభించిందని తెలిపారు.

28లోగా లైఫ్ సర్టిఫికెట్లు..

జిల్లాలోని పెన్షనర్లు ఏటా అందించే లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెల 28 లోగా ఆయా సబ్ ట్రెజరీలలో అందించాలని కోరారు. సబ్‌ట్రెజరీ పరిధిలో స్వయంగా గానీ, వారి ప్రతినిధి ద్వారా గానీ అందజేసే వెసులుబాటు ఉందన్నారు. వయోభారంతో, అనారోగ్యంతో ఉన్నవారు వారి పరిధిలోని ట్రెజరీ అధికారికి తెలియజేస్తే.. కార్యాలయ సిబ్బంది ద్వారా పెన్షనర్ ఇంటి వద్దనే కేవైసీ నమోదు చేసి లైఫ్ సర్టిఫికెట్ స్వీకరించేందుకు అవకాశం ఇస్తామన్నారు. 'జీవన్ ప్రమాణ్' పోర్టల్ ద్వారా పాత పెన్షన్ దారులు లైఫ్ సర్టిఫికెట్లు రిజిస్ట్రేషన్ గావించి సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.